క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి: నగర పరిధిలోని నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని యర్రబాలెంలో శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపిన వివరాలు.. తాడేపల్లి ఎన్టీఆర్ కరకట్టకు చెందిన చిట్టిపోతుల జోజిబాబు, నగర పరిధిలోని యర్రబాలెంలో ఇంటింటికి తిరిగి 35 బస్తాల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. అనంతరం బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడి చేసి ఆటోను స్వాధీనం చేసుకుని, జోజిబాబును స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించడం బాధ్యత

మంగళగిరి: మానవ అక్రమ రవాణాను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ తెలిపారు. ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని సీకే జూనియర్ కళాశాల ఆవరణలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. బలరామకృష్ణ మాట్లాడుతూ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా కృషి చేసి 28,200 మందిని కాపాడి పునరావాసం కల్పించినట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏ రత్నబాబు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచలోనే అతి పెద్ద నేరంగా ఉందని, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణా కావడం బాధాకరమన్నారు. పాఠశాల హెచ్ఎం ఏవీఎస్ వరలక్ష్మి మాట్లాడారు.కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ నరేష్‌కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ పాల్గొన్నారు.

సహకార రంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి

డివిజనల్ సహకార శాఖ అధికారి రత్నావతి



మంగళగిరి: రాష్ట్రంలో సహకార రంగం బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని సహకార శాఖ డివిజనల్ అధికారి రత్నావతి తెలిపారు. పట్టణంలోని బ్యాంక్ కాలనీలోని మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సహకార రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టి వాటిని కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా ప్రజలలోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యాలయ ఆవరణలో సహకార జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఆర్ల బ్రహ్మయ్య, డైరెక్టర్లు సుంకర సుబ్బారావు, కర్రి మరియదాసు, కో ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ బి.ఉమాదేవి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొవ్వా వెంకటేశ్వరరావు, సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాయల రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు నృసింహస్వామి సన్నిధిలో వస్త్రాల వేలం

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి వస్త్రాలకు బహిరంగ వేలం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి, అమ్మ వారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను వేలం వేయనున్నట్లు వివరించారు.

జీడీసీసీ బ్యాంక్‌లో ముగ్గురికి జీఎంలుగా పదోన్నతులు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో డెప్యూటీ జనరల్ మేనేజర్లుగా పని చేస్తున్న వి.వి.ఎస్. ఫణి కుమార్, సీహెచ్. అజయ్ కిశోర్, కె.మాధవీలకు జనరల్ మేనేజర్లుగా పదోన్నతి కలిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రోసూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో షేక్ గన్ సైదాకు గుమస్తాగా కారుణ్య నియామకం కింద పత్రం అందజేశారు. ఆయన తండ్రి క్రోసూరు పీఏసీఎస్‌లో గుమస్తాగా పని చేస్తూ ఇటీవల మరణించారు. అనంతరం జీఎంలుగా పదోన్నతులు పొందిన ముగ్గురిని బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, బ్యాంక్ సీఈవో టి.కృష్ణవేణి, పాలకవర్గ సభ్యులు, పలువురు బ్యాంక్ అధికారులు ఘనంగా సత్కరించారు.

నిజాయతీ చాటుకున్న ఆటోడ్రైవర్

పట్నంబజారు: ఆటోలో మరిచిపోయిన పర్సును ప్రయాణికుడికి అప్పగించి ఆటో డ్రైవర్ నిజాయతీని చాటుకున్నాడు. లాలాపేట పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి హిమని కూల్‌డ్రింక్ సెంటర్ వద్ద ఆటో ఎక్కి ఆర్టీసీ బస్టాండ్ వద్ద దిగి వెళ్లిపోయాడు. అనంతరం డ్రైవర్ షేక్ జానీ బాషా తన ఆటోలో పర్సు ఉండటం గమనించి అప్పటికప్పుడు బస్టాండ్‌లోకి వెళ్లి వెతకగా, ప్రయాణికుడు కనబడలేదు. తర్వాత దాన్ని లాలాపేట పోలీసులకు అందజేశాడు. అందులో రూ. వెయ్యి నగదు, మూడు ఏటీఎం కార్డులతోపాటు, పలు గుర్తింపు కార్డులు ఉన్నాయి. సదరు వ్యక్తి లాజరస్‌గా గుర్తించి పోలీసులు విషయాన్ని అతడికి తెలియజేశారు. నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్ జానీబాషాను లాలాపేట పోలీసులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

పుట్టల వద్ద బారులు తీరిన భక్తులు



శివాలయ ఆవరణలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద పాలు పోసేందుకు బారులు తీరిన భక్తులు

మంగళగిరి: నాగుల చవితి సందర్భంగా శుక్రవారం నగరంలోని నాగేంద్రస్వామి పుట్టల వద్ద పాలు పోసేందుకు భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచే మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని గంగా భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి ఆలయం(శివాలయం) ఆవరణలోని నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసి, కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయంలో ఏర్పాట్లను ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ నేరెళ్ళ లక్ష్మీరాధిక, సభ్యులు అద్దంకి వెంకటేశ్వర్లు, కొల్లి మునలారెడ్డి పర్యవేక్షించారు. నగర పరిధిలోని నవులూరు నాగేంద్రస్వామి ఆలయం వద్దకు భక్తులు బారులు తీరడంతో ఆలయ ఆవరణలో భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాసు రామకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాడేపల్లి మండలంలో...

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో నాగుల చవితిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము 3 గంటల నుంచి శివాలయాల్లో ఇతర దేవాలయాల్లో ఉన్న భక్తులు బారులు తీరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని వీరభద్రస్వామి ఆలయంలో ఉన్న పుట్ట వద్ద ఆలయ పాలక మండలి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీతానగరం కృష్ణాతీరంలో విశ్వేశ్వరస్వామి దేవాలయంలో పుట్ట వద్ద దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వడ్డేశ్వరం ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న నాగేంద్ర స్వామి దేవస్థానం వద్ద మాజీ సర్పంచి కత్తిక మల్లికార్జునరావు సొంత ఖర్చులతో పాలు ఏర్పాటు



సీతానగరం సోమేశ్వరస్వామి ఆలయంలో పుట్టలో పాటు పోస్తున్న భక్తులు

చేశారు. పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, మెల్లెంపూడి, చిర్రావూరు, పట్టణ పరిధిలోని మహానాడు, సుందరయ్యనగర్, రామయ్యకాలనీ, పోలకంపాడు ప్రాంతాల్లో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని



నవులూరు పుట్ట వద్ద క్యూలైన్‌లో భక్తులు, పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

మహంకాళీ అమ్మవారి దేవస్థానం వద్ద ఉన్న పుట్ట వద్ద ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈమని, చినపాలెం, పెదపాలెం, మోరంపూడి, తుమ్మపూడి, రేవేంద్రపాడు, వీర్లపాలెం, చుక్కవల్లి వారిపాలెం తదితర ప్రాంతాల్లో పుట్టలో పాలుపోసి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలుగు పద్యాల పోటీలు

తాడేపల్లిరూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో తెలుగు పద్యాల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి షేక్ నాగుర్ బాషా మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్స్ మరియు సీనియర్ విభాగంలో తెలుగు పద్యాల పోటీలు నిర్వహించామని, వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని, న్యాయనిర్ణేతలుగా బి.లక్ష్మీపద్మావతి, పి.రాధిక, జె.విద్యుల్లత, సిహెచ్.రమేష్ వ్యవహరించారని తెలిపారు. అంతరించిపోతున్న తెలుగు భాష, తెలుగు పద్యం మరియు తెలుగు కవితలు ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరల పునరుజ్జీవం వస్తుందని పేర్కొన్నారు.

గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలి

మంగళగిరి: విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని పలువురు వక్తలు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు పద్య రచనా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఆవశ్యకత ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా టీఎస్కే శర్మ, వై.నాగకుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు పి.కృష్ణ, ఎస్.ఆరోగ్యం, నవీన్, నజీర్ పాల్గొన్నారు. నగర పరిధిలోని నూతక్కి శాఖా గ్రంథాలయంలో జాతీయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూలు అసిస్టెంట్‌లు ఏ శంకరరావు, యు.రాజేశ్వరి, గ్రంథాలయాధికారి వై.నరసింహారావు పర్యవేక్షించారు.

తాడికొండ గ్రంథాలయంలో...

తాడికొండ: చిన్నారులోల అంతర్లీనంగా దాగిఉన్న



తెలుగు పద్యాలు పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

ప్రతిభను వెలికితీసేందుకు చిత్రలేఖనం దోహదం చేస్తుందని తాడికొండ గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని తాడికొండ గ్రంథాలయంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయురాలు పద్మజా కుమారి పాల్గొన్నారు. తుళ్లూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్, ఉపాధ్యాయులు టి.సుజాత, పి.భవాని, కె.రజిని పాల్గొన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. పోటీలకు స్థానిక సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం విద్యార్థులు, అల్లంవారిపాలెం జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు 76 మంది పాల్గొన్నారు. కార్యక్రమాలను గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్, డి.కృష్ణమూర్తి, సైదాసాహెబ్ పర్యవేక్షించారు.

వైద్యం కోసం జీజీహెచ్‌కు తరలింపు

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో ఎంపిక చేసిన రోగులను వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తున్నట్లు పీహెచ్‌సీ సెక్టార్ వైద్యురాలు పి. ఎస్తేరురాణి తెలిపారు. ఫిరంగిపురం 1,2,3 సచివాలయాలు, వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాలకు చెందిన రోగులు 48 మందిని వాహనాలల్లో ఆరోగ్యసిబ్బంది తీసుకువెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.విలియం, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, హెచ్ఎస్ కొండపల్లి సుదర్శన్‌రాజు ఉన్నారు.

నేడు ఎయిమ్స్‌లో అనుసంధాన్ దివస్

మంగళగిరి: నగరంలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో శనివారం అనుసంధాన్ దివస్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సులో పరిశోధనలపై పలు అంశాలలో చర్చలు ఉంటాయని చెప్పారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళగిరి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు గాయం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ఎరువుల దుకాణాలపై పురుగుల మందుల షాపులను విస్తృతంగా తనిఖీలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఎ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూ సర్వే పరిశీలన



మేడికొండూరు: మండల పరిధిలోని మంగళగిరిపాడు గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన భూముల రీ సర్వే పనులను గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి కుసుమ శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. సంబంధిత సర్వే పంచాయతీ బృందాలకు సూచనలు చేశారు. సర్వే నిర్వహించడం వల్ల గ్రామ కంఠం పరిధిలో నివాసం ఉంటున్న ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధించిన వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్వే నోడల్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, మండల విస్తరణ అధికారి టి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు బి.రమేష్, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీలోని గ్రామ సచివాలయాల సందర్శన



తాడికొండ మండల పరిషత్‌లో సంక్షేమ పథకాలపై తెలియజేస్తున్న ఎంపీడీఓ అత్తోట దీప్తి

తాడికొండ: భారత్ దర్శన్‌లో భాగంగా ఏపీలోని సచివాలయలను సందర్శించేందుకు శుక్రవారం కేంద్ర సచివాలయ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌ల బృందం పర్యటించింది. అందులో భాగంగా తాడికొండ మండలంతో పాటు ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెం గ్రామాలను సందర్శించి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పరిపాలన విధానాన్ని నిశితంగా పరిశీలించారు. ఏపీలో జరుగుతున్న అవినీతి రహిత పాలన, లబ్ధిదారులకు నేరుగా ఖాతాలకే సంక్షేమ పథకాలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్న పాలన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పాలనాధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వ పనితీరు, గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రంలోని ముఖ్యమంత్రి వరకు సమన్వయంతో చేసే పనితీరు తమను అబ్బుర పరచిందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ కె శ్రీదేవి, జిల్లా శిక్షణ మేనేజర్ కె.నాగేశ్వరరావు, నోడల్ అధికారులు నాగానంత్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వివాహితపై లైంగిక దాడికి హోంగార్డు యత్నం

- తప్పించుకున్న మహిళ
- బంధువుల సహాయంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- హోం గార్డుపై కేసు నమోదు

తాడేపల్లిరూరల్: హోంగార్డు ఓ మహిళపై లైంగిక దాడికి యత్నించడంతో ఆ మహిళ తప్పించుకుని పారిపోయిన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. విజయవాడలో హోంగార్డుగా పనిచేస్తున్న రంగుల పూర్ణచంద్ర సింగ్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని పెనుమాకలో ఎస్టీ కాలనీలో నివాసముంటున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో పక్కనే వేరే ఇంట్లో రెండునెలల చిన్నారితో ఓ వివాహిత మహిళ కన్నబిడ్డకు పాలిస్తున్న సమయంలో హోంగార్డ్ లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆ తల్లి బలంగా ఉన్న పూర్ణచంద్రను తోసి పారిపోయేందుకు ప్రయత్నం చేయగా హోంగార్డు పూర్ణచంద్రసింగ్ వెంటపడ్డాడు. ఆ సమయంలో ఆమె కేకలకు స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై మద్యం మత్తులో దాడిచేశాడు. అడ్డు వచ్చిన మహిళలను కొట్టేందుకు ప్రయత్నించగా స్థానికంగా ఉన్న కొంత మంది యువకులు పూర్ణచంద్రసింగ్‌ను అడ్డుకున్నారు. మద్యంమత్తులో ఉన్న ఆయన కులం పేరుతో దూషించడంతో స్థానికులు తమ చేతులకు పనిచెప్పి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి హోంగార్డు పూర్ణచంద్రను అదుపులోకి తీసుకున్నారు. జరిగిన ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు పూర్ణచంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాడేపల్లికి చేరిన ఐక్యత విజయపథం యాత్ర

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పేదప్రజల సమస్యల పరిష్కారం కోసం మాజీ ఐఎఎస్ అధికారి విజయ్‌కుమార్ చేపట్టిన ఐక్యత విజయ పథం యాత్ర శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లికి చేరింది. ఈ సందర్భంగా మాజీ ఐఎఎస్ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ జూలై 23న తడ నుంచి ప్రారంభించిన యాత్ర నేటికి 1500 కిలోమీటర్లు పూర్తి చేసుకుని తాడేపల్లికి చేరిందని, పేదలకు కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ అని అన్నారు. ఈ యాత్రద్వారా పేదల సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాని చూపించాలనే ఆశయంతో ఈ యాత్ర నిర్వహిస్తున్నానని, రాజకీయాలతో సంబంధం లేదని, ఇది నా వ్యక్తిగత యాత్ర అని అన్నారు.

48 గంటల ధర్నాను విజయవంతం చేయండి

జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అమల చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసన 48 గంటల ధర్నా నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ఏపీ రైతు సంఘం రాజధాని డివిజన్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ

ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని అధిగమించడానికి, రైతుల ఆత్మహత్యలను నివారించడానికి, వ్యవసాయం గిట్టుబాటుతో రైతు తన కుటుంబంతో ఆత్మగౌరవంగా ఉండానికి, రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాస్తూ మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాజధాని అధ్యక్షులు కె.ఈశ్వర్‌రెడ్డి, వై.శ్రీనివాసరావు, ఎస్‌కే ఎర్రపీరు, టి.బక్కిరెడ్డి, నాగేశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

బీజేపీని నమ్మే పరిస్థితిలో బీసీలు లేరు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు



మాట్లాడుతున్న కేశన శంకరరావు

మంగళగిరి: బీజేపీని నమ్మే పరిస్థితిలో బీసీలు లేరని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. నగరంలోని జాతీయ రహదారి వెంట ఉన్న సంఘం కార్యాలయంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అధ్యక్షతన శుక్రవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ బీసీ వ్యక్తి అయిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉన్నా బీసీల అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని కోరారు. కనీసం కులగణన చేయాలని ఏడు దశాబ్దాలుగా బీసీలు పోరాడుతుంటే గత ఎన్నికల ముందు రాజ్‌నాథ్‌సింగ్ కుల గణనకు అనుకూలంగా ప్రకటన చేసినా కార్యాచరణకు నోచుకోలేదంటే ప్రధానికి బీసీలపై ఎంత ప్రేమ ఉందో తెలియజేస్తుందన్నారు. 2021 సెప్టెంబర్ 23 వ తేదీన బీజేపి కులగణన తమ విధానం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం బీసీలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. అధికారంలో లేని రాష్ట్రంలో అధికారం కొరకు బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా చేస్తామని బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాగితాల స్వాతి గౌడ్, ఉడతా శ్రీనివాస్, ఆలా శివాజీ, సత్యనారాయణ, ధనుంజయ్, కిరణ్ పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచే క్రీడాకారులకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లేశ్వరి

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడాకారుల్లో ప్రతిభను బయటకు తీసేందుకు గ్రామ స్థాయి నుంచే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ దేవరపల్లి వీరయ్య అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్రపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ వీరయ్య మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి 20 వ తేదీ వరకు దుగ్గిరాల మండల పరిధిలోని ప్రతి సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలను 15 సంవత్సరాల పైబడిన వారికి నిర్వహిస్తోందని, ఇందు కోసం ప్రభుత్వం మొట్టమొదటి సారిగా ప్రత్యేక వెబ్ సైట్ ఏర్పాటు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.శ్రీనివాసరావు, ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఏఎస్ఐ సత్తార్, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

కేఎల్‌యూ రిజిస్ట్రార్ సుబ్బారావు



విద్యార్థులు, అధ్యాపకులతో కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు

తాడేపల్లిరూరల్: విద్యార్థులు జీవితంలో సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం అన్నింటికన్నా ముఖ్యమని కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు అన్నారు. వడ్డేశ్వరం రూరల్ పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఎత్నిక్ డే వేడుకలకు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్న తరువాత దృఢ చిత్తంతో, అంకిత భావంతో లక్ష్య సాధన కోసం నిరంతర ప్రయత్నం సాగించాలని సూచించారు. రోజులో ఎన్ని గంటలు చదివామన్నది ప్రధానం కాదని, చదివిన అంశాలలో ఎంత మన మెదడు గ్రహించిందనేదే ముఖ్యమని అన్నారు. ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబుతో కలసి సివిల్ సర్వీసెస్ సాధించడానికి కావల్సిన ముఖ్యమైన ప్రామాణికమైన రాజనీతి శాస్త్రం, జాగ్రఫి, చరిత్ర మొదలైన 8 గ్రంథాల కిట్స్‌ను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎం.హెచ్.ఎస్.ప్రసాద్, ఎన్.వెంకట్‌రామ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ పోలురాజు, ఎం.హెచ్.ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, బి.ఎ.(ఐఎఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య, ఉప విభాగాధిపతి డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ సాయి కుమార్ పాల్గొన్నారు.

దివిసీమ ఉప్పెనపై ఆక్రోశం 'కొయ్యగుర్రం'

- తుపాను వ్యవస్థపై తెలుగు కవి కన్నెర్ర
- తొలి ఆధునిక మహాకావ్యంగా గుర్తింపు
- తెలుగు వచన కవితకు గట్టి పునాది

తెనాలి: 'కొయ్యగుర్రం తొలి ఆధునిక రాజకీయ తాత్విక కావ్యం...విశ్లేషకులు దీన్ని మహాకావ్యం అన్నారు. వచన కవిత ఒక రూపంగా గట్టిగా నిలదొక్కుకుందంటే కారణం కొయ్యగుర్రం' తుపాను వ్యవస్థపై తెలుగు కవి కన్నెర్రగా వెలువడిన దీర్ఘకవిత 'కొయ్యగుర్రం'పై సమీక్షల్లో ఇదొకటి. 1977 నవంబరు 19న వచ్చిన తుపానుపై ప్రకృతి విలయ తాండవానికి ప్రజల్ని వదిలేసిన నాటి పాలకుల అసమర్థతపై నగ్నముని ఆక్రోశం దీర్ఘకవితగా పెల్లుబికింది. పాలకులు ఊరేగుతున్న కొయ్యగుర్రాన్ని తగులబెట్టాలని హితబోధ చేసింది. ప్రముఖ రచయిత, కవి నగ్నముని రచించిన కొయ్యగుర్రం పుస్తకం నాలుగున్నర దశాబ్దాల తర్వాత నాలుగో ప్రచురణగా వెలువడింది. రచయిత స్వస్థలమైన తెనాలిలో ఈనెల 19వ తేదీ సాయంత్రం ఆవిష్కరించనున్నారు.

ప్రభుత్వాల వైఫల్యంపై..

స్వాతంత్ర్యం అనంతరం పార్లమెంటరీ రాజకీయాంశాన్ని మొదటిసారి సాహిత్య రంగంలో ఒక 'వస్తువు'గా ప్రవేశపెట్టినవారు నగ్నముని. ప్రభుత్వాల వైఫల్యంపై 'దిగంబర కవిత్వం'తో సంచలన నిరసన తెలిపారు. సాహిత్యాన్ని ఉద్యమ స్థాయికి తీసుకెళ్లిన దిగంబర కవిత్వానికి 'కర్త, కర్మ, క్రియ నేనే'నంటూ సగర్వంగా ప్రకటించుకున్నారు. ఎమర్జన్సీలో అకృత్యాలపై 'విలోమ కథలు'తో అధిక్షేపం తెలియజేశారు. ప్రజల మనస్సులను తమకు అనుగుణంగా మార్చే కార్పొరేట్ వ్యూహాలపై 'ఆకాశదేవర' కథలో హెచ్చరించారు. పాలకుల అసమర్థతపై రచించిన 'కొయ్యగుర్రం' తొలి ఆధునిక మహాకావ్యంగా, రాజకీయ తాత్విక కావ్యంగా లేవనెత్తిన చర్చ ఒక చరిత్ర.

1977 నవంబరు 19న ఉప్పెన వల్ల జరిగిన దారుణాల కారణాల లోతుల్లోకి వెళ్లి, ఆక్రోశాన్ని వెల్లడించి, తుపాను వ్యవస్థపై మనకు ఆగ్రహాన్ని కలిగించటమే కొయ్యగుర్రం కావ్య లక్షణం. ఆనాటి దారుణానికి ఇంత గాఢమైన ఆక్రోశం వెల్లడించే కవిత్వాన్ని చూడలేదని ఆచార్య చేకూరి రామారావు అప్పట్లో అన్నారు. 'వచన కవిత్వం అధోగతిలో ఉన్న సమయంలో ఉదాత్తమైన వస్తువుతో 'సీరియస్‌నెస్' ఎక్కడా చెడకుండా 'ఫ్రీవర్స్'నే కవితా వాహకంగా గ్రహించి ఆధునిక మహాకావ్యాన్ని సృష్టించి, ఒకేసారి తెలుగు కవిత్వాన్ని- వచన కవిత్వాన్ని- ఆధునిక కవిత్వాన్ని మళ్లీ పైకెత్తారు నగ్నముని' అనిపించుకున్నారు.

ప్రకృతి విలయ తాండవానికి ప్రజల్ని వదిలేసిన పరిపాలకులే హంతకులన్న విషయం కొయ్యగుర్రం కావ్యం చదివితే అర్థమవుతుంది...కొయ్యగుర్రాన్ని తగులబెట్టగల కొత్త ఇంధనాన్ని కనిపెట్టటమే కర్తవ్యం అని గుర్తుచేసింది. ప్రజలు తమ ప్రతినిధులుగా పరిపాలకులను ఎన్నుకునేటప్పుడు-వారి సమర్థత, అసమర్థతలను ప్రధానంగా దృష్టిలో తీసుకోవలసి ఉంటుందని స్పష్టం చేశారు నగ్నముని. 'ఈ రచనలో నగ్నముని ఆలోచనా పరిధి విస్తరించి తాత్వికస్థాయికి చేరాడు' అన్నారు పురాణం సుబ్రహ్మణ్యశర్మ. కొయ్యగుర్రం పుస్తకంపై తర్వాతికాలంలో ప్రముఖ రచయితల వ్యాఖ్యానాలతో 'కావ్యావలోకనం','కొయ్యగుర్రం దార్శనికత' సంకలనాలు వచ్చాయి. 'గ్లోబల్ సందర్భంలో నగ్నముని కొయ్యగుర్రం' పేరుతో మరో పుస్తకం వెలువడింది. రష్యన్, ఇంగ్లిష్, హిందీ, పంజాబీ, మరాఠీ, మైథిలి, ఒరియా, తమిళం, కన్నడ భాషల్లోకి అనువాదమైంది.

ఎనిమిది దశాబ్దాల క్రితం తెనాలిలో కళ్లుతెరిచిన మానేపల్లి హృషీకేశవరావు, నగ్నమునిగా మారడం అంత తేలిగ్గా జరగలేదు. తండ్రి మానేపల్లి సంగమేశ్వర కవి పద్య వారసత్వాన్ని కొనసాగించాడు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశించేనాటికి ఆయన వయసు పద్దెనిమిదేళ్లు. నాలుగు దశాబ్దాలపాటు రాజకీయ నేతల అసలు రూపాన్ని దగ్గరగా చూశారు. ఆయన కవిత్వం మొదలుపెట్టేనాటికి కాలం అనేక సంక్షోభాలను చవిచూసింది. అయిదు దశాబ్దాల నగ్నముని సాహిత్య జీవితం, తెలుగునేలపై జరిగిన అన్ని కల్లోలాలను ఒక క్రమపద్ధతిలో నమోదుచేసింది. తెలుగు సాహిత్య వాక్యానికి రాజకీయ వాసనలు అద్దాడు. రాజ్యహింసను, నిర్బంధాలనూ అనుభవించాడు. పత్రికల్లో కాలమ్ వ్యాసాలు రాశారు. మరో చరిత్ర, ఎంఎల్ఏ ఏడుకొండలు, త్రిశూలం, ఉదయం సినిమాలకు మూలకథలు సమకూర్చారు. అంతకుముందే ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపిల్ల' నవలను నాటకీకరించారు. ఈ నాటకాన్ని ఏఆర్ కృష్ణ వందకుపైగా ప్రదర్శనలిచ్చారు. 2011లో రచించిన 'ఆకాశదేవర'ను పాటిబండ్ల ఆనందరావు నాటకీకరించారు. తెనాలిలో అజోవిభో కందాళం ఫౌండేషన్ నగ్నమునిని సత్కరించి 'సాహితీ వైజయంతి' శీర్షికతో సన్మాన విశేషసంచికను విడుదల చేశారు.